# మౌన సుందరి

**ఇచ్ఛాపురపు రామచంద్రం**

అది చాలా పెద్ద పట్నమేమీ కాదు. అందుచేత రాత్రి పదకొండు గంటలనుంచీ రోడ్లు నిద్ర పోతూనే ఉంటాయి. ఆ రోడ్డయితే మరీ గాఢ నిద్రలో ఉంది.

ఒంట్లో బాగులేదేమో వీధి దీపాలూ తొందరగానే నిద్రపోతున్నాయి. దీపాలు కాస్త కళ్ళు మూసుకోడంతో ఆ రోడ్డు మరీ చీకటిగా ఉంది.

జంక్షన్‌కి కొంత దూరంలో రోడ్డు పక్క ఒకే ఒక్క దీపంమాత్రం ఒంటెపిల్లి రాకాసిలా వెలుగుతూంది ఎందుకనో! బహుశా దానికి నిద్ర పట్టని జబ్బు కాబోలు.

ఆ దీపం దగ్గర— ఒక శిల్పం.

శిల్పమనేసరికి అది అర్ధనగ్నంగానో, పూర్ణ నగ్నంగానో ఉందనుకుంటే అది పొరపాటే. రోడ్డుపక్కనున్నా ఆ బొమ్మ బజారు బొమ్మలా కాకుండా చీర కట్టుకునీ జాకెట్ వేసుకునీ చక్కగా సంసార పక్షంగానే ఉంది. మరీ ఖరీదైన పాలరాతితో మలచకపోయినా ఆ శిల్పం వెలుగులో మన్నగానూ నిగనిగలాడుతూనూ అందంగా ఉంది. అలాగ అర్ధరాత్రి ఒంటరిగా ఉన్న ఆ శిల్పాన్ని చూస్తే ఎవరికి మనసు తొణకదు? పాపం...ఆ శిల్పం చాలాకాలంనుంచే అక్కడ ఉంది కొరత వేసినట్లు. ఎండా వానలనుంచి కాపాడేందుకో చాలని సిమెంటు గొడుగు—కొంచెం ఎత్తుగా... దిమ్మమీద నిలుచుని రోడ్డువేపు చూస్తూ రోడ్డుకే అందంగా ఆ శిల్పం అక్కడ ఎన్నాళ్ళనుంచి ఉందో దాని వెనుక కథేమిటో పట్టించుకున్నవారు బహు తక్కువ. అయితే ఏం? జీవకళ ఉట్టిపడే ఆ శిల్పపు ముఖమండలం ఒకసారి చూస్తే మరోసారి చూడాలనిపించక మానదు. ఆ శిల్పం చిత్రమైనదే.

ఎక్కడో దూరంగా పన్నెండు గంటలు కొట్టారెవరో. తానెవరికంటా పడకూడదన్నట్లు అంత చీకటిలోనూ అతి జాగ్రత్తగా పక్క పక్కన ఒదిగి ఒదిగి నడుస్తూ వస్తున్నాడతను. వచ్చి ఒక్కసారి శిల్పాన్ని చూసుకున్నాడు ఆత్రంగానూ, అతి ఆప్యాయంగానూ. ఒక్కసారి సిగరెట్ గాఢంగా పీల్చాడు. అటూ ఇటూ కన్నులతో గాలించాడు ఎవరూ లేరని నిర్ధారణ చేసుకుంటున్నట్లు. మళ్ళీ ఆ బొమ్మ వైపు చూశాడు. అతని కన్నులలోకి వెలుగూ, ముఖంలోకి ఆనందమూ పెదవులమీదకి మందహాసమూ వచ్చాయి.

మెల్లగా మెట్లెక్కి దిమ్మమీదకు చేరాడు. మళ్ళీ ఆ బొమ్మని చూశాడు తమకంతో. అతని శరీరంలోకి ఉద్రేకం వచ్చింది. నరాలలో రక్తం వేగం పుంజుకుంది. గుండె మరింత వేగంగా కొట్టుకోసాగింది. ఆ శిల్పం తనని చూసి పలకరిస్తున్నట్లు, కుశలమడిగినట్లు అతనిలో భావన. ముఖ్యంగా ఆ పెదవులు చిరునవ్వుతో పిలుస్తున్నట్లు, నున్నని అద్దాలలాంటి ఆ చెక్కిళ్ళు అతన్ని వచ్చి ముద్దు పెట్టుకోమని ఆరాటంగా ఆహ్వానిస్తున్నట్లు అతనిలో అనేక భావనలు.

అతనిలో ఉప్పొంగిన ఉద్వేగం...సర్వమూ మరిచిపోయాడు. బొమ్మ దరికి చేరి సిగరెట్ పొగ పీల్చి. చేతిలో సిగరెట్‌తోనే ఆమె మెడచుట్టూ చేతులు వేసి, చెక్కిళ్ళను ముద్దాడి, పెదవులమీద గాఢంగా చుంబిస్తూ— పరవశంలో ప్రపంచమే మరిచిపోయాడు. కాలగమనమే మరిచిపోయాడు.

"ఏయ్ !" గర్జింపు.

అతను త్రుళ్ళిపడ్డాడు. వణికి పోయాడు నిలువెల్లా. బొమ్మ వదిలి, దిమ్మ దిగి పారిపోబోయాడు కాని, అతని చేయి మరొక బలమయిన చేతిలో చిక్కుకుంది. ఈ వృద్ధుడి బలం విదిలించుకుందుకు చాలలేదు. తాను దొరికిపోయానని స్ఫురణకి రాగానే అతను ఆపాదమస్తకమూ వణికిపోయాడు.

"ఎవరు నువ్వు?"

అతను తల వంచుకున్నాడు.

"ఏం చేశావ్!"

"........"

"సిగ్గులేదూ అటువంటి పని చెయ్యడానికి? మనిషివేనా అసలు? చూడబోతే అరవై దాటినట్లే ఉంది వయసు!" అసహ్యాన్ని వెళ్ళగక్కుతూందా కంఠం.

"ఏభై నాలుగు..." మెల్లగా అన్నాడు వృద్ధుడు.

"ఈ వయసులో ఇదేం బుద్ధి? అంత ఒళ్ళు మదమెక్కి ఉంటే ఏ సాని కొంపకో పోరాదూ? డబ్బుల్లేవా?"

"ఉన్నాయి...కాని..." నసిగాడు.

"బొమ్మని...రాతి బొమ్మని... ముద్దెట్టుకుంటేనూ, కౌగిలించుకుంటేనూ ఏమొస్తుంది? సిగ్గులేదూ?"

"........"

"ఉలుకూ పలుకూ లేకుండా బెల్లం కొట్టిన రాయిలా అలా నిలబడతావేం? నిజం చెప్పు— ఏమిటి నీ సంగతి?" గర్జించాడు యువకుడు.

తప్పు చేసినవాడి వయసుకి గౌరవం ఇవ్వనక్కర్లేదనుకున్నాడు కాబోలు ఏకవచన ప్రయోగమే కొనసాగించాడు.

"చెబుతాను. కాని...మీరు...నా పరువు నలుగురిలోనూ..."

"తీయనులే. కానియ్."

"నా ఇరవయ్యోఏట పదహారు మంది అమ్మాయిలను చూసి రేణుకను వివాహం చేసుకున్నాను. ఆమెలో నన్నమితంగా ఆకర్షించినవి లేత తమలపాకులవంటి చెక్కిళ్ళూ, దొండపండు వంటి అధరమూ. ఎంతటెంతట ఆ చెక్కిళ్ళను ముద్దు పెట్టుకుని ఆ అధరం చుంబిస్తానా అని తహతహ లాడిపోయాను వివాహం జరిగేవరకూ. వివాహమైంది. ఆమె నాతో ముప్పయ్యేళ్ళు సంసారమూ చేసింది. ఇద్దరు పిల్లల్నీ కన్నది. కానీ...ఆ చెక్కిళ్ళను ముద్దాడాలనీ, పెదవులను చుంబించాలనీ నాలో గాఢంగా ఉండే కోరిక తీరనేలేదు."

"ఆదేం?"

"......."

"క్షమించండి. అడగకూడని...అసభ్యమయిన... అనుమానం నివారించమంటున్నందుకు. ఆమె... మీ భార్య..."

"చనిపోయింది నాలుగేళ్ళ క్రిందట. ఉండీ ఉండీ ఒక్కొక్క రాత్రి ఆమె గుర్తొస్తుంది. నా కోరిక పడగ విప్పుతుంది. అంతే. మరి నిద్రపట్టదు. మనసు గింజుకుంటుంది. భరించలేక ఇలాగ వచ్చి ఈ శిల్పాన్ని ముద్దు పెట్టుకుని వెళ్ళిపోతాను. హాయిగా నిద్రపడుతుంది. అంతే. నిజంగా నా మనసులో ఇంకే దుర్బుద్ధీ లేదు."

"ఈ శిల్పం మీ భార్యదా?"

"ఊహుఁ. కాని ఆమె పోలికలు చాలా ఉన్నాయి ఈ బొమ్మలో. ముఖ్యంగా అవే చెక్కిళ్ళు, అవే పెదవులు."


"ఆమె జీవిత కాలంలో మీ రామె నెందుకు ముద్దు పెట్టుకోలేకపోయారు? మీ భార్యేకదా? కుతూహలంకొద్దీ అడుగుతున్నాను."

"పెళ్ళినాటికే నాకు సిగరెట్ అలవాటు. అలవాటేమిటి, వ్యసనం. ఎంత ప్రయత్నించినా సిగరెట్ మానుకోలేకపోయాను. రేణుకకి ఆ వాసనంటే పడదు. వీధిలో నేను సిగరెట్ కాలిస్తే పెరట్లోకి పోయేది." ఆ వృద్ధుడి కంఠం నిండా అపరిమితమయిన పశ్చాత్తాపం.

"బాగానే ఉంది. కాని... ఈ చక్కని శిల్పాన్ని అలాగ ఎంగిలీ, మలినమూ చేయడం తప్పుకాదూ?" అలా మందలిస్తున్నప్పుడు ఆ యువకుడి కంఠం కొంచెమయినా తీవ్రంగా లేదు.

ఒకటి రెండు నిముషాలు నిశ్శబ్దంగా గడచిపోయాయి.

భయం భయంగానే అడిగాడు వృద్ధుడు— "మరి...ఇటువంటి రాత్రివేళ...మీ రెందుకున్నారిక్కడ ఒంటరిగా?"



ఆ యువకుడు కొంచెం గింజుకుని "మాదీ మీలాంటి కథే. ఈ శిల్పమంటే నాకు చాలా ప్రేమ. ఒక్క విషయంలో తప్ప—అన్ని విధాలా ఈ బొమ్మ నా భార్యని పోలి ఉంటుంది. అయితే నా భార్య బ్రతికే ఉంది. నే నిక్కడికి వచ్చేది ఈ అద్భుతమయిన శిల్పాన్ని ముట్టుకుందుకూ కాదు, ముద్దెట్టుకుందుకూ కాదు" అన్నాడు.

వృద్ధుడు తల ఎత్తి చూశాడు ధైర్యంగా. "మీ భార్యలో మీకు నచ్చనిదో, మీ కభ్యంతరకరమయినదో ఏమిటి? అన్నట్లు—మీరు సిగరెట్ కాలుస్తారా?" సిగరెట్, అగ్గిపెట్టె అందించబోయాడు.

"ఉహూఁ. నా కలవాటు లేదు. ఆమె నందంగా సృష్టించిన విధాత ఆమె కొక అవలక్షణం పెట్టాడు. మెలకువగా ఉంటే చాలు. ఆమె నోరు మూత పడదు. ఈ విషయం ఆమెను వివాహం చేసుకున్నాక కానీ తెలియలేదు. నిర్మొహమాటంగానూ నిజంగానూ నిష్కర్షగానూ చెప్పాలంటే నేను పెళ్ళి చేసుకున్నది ఒక చాటర్‌బాక్సునీ, లౌడ్ స్పీకర్‌నీ. ఆమెకు తెగవాగుడు. ఆ కంఠం—అతి కర్కశంగానూ బిగ్గరగానూ, దుర్భరంగానూ ఉంటుంది. ఆమె నిద్రపోతున్నప్పుడు కూడా మాట్లాడుతున్నట్లే ఉంటుంది నోరు చూస్తుంటే. ఆ పెదవులు మూత పడవేమో అనుకుంటాను. ఆమె కంఠస్వరం వినలేక చాలా విసుగూ కోపమూ వచ్చినప్పుడు...మూగదైపోయినా బాగుండుననిపిస్తుంది.

మొదటిసారి ఈ శిల్పాన్ని చూసినప్పుడు రమే కాని మితభాషిణి, సౌమ్యమూర్తి అయితే ఈ శిల్పంలాగే ఉంటుందనిపించింది. నా భార్య రమలో ఉన్న అవలక్షణం ఈ బొమ్మలో లేదు. మాట్లాడని ఈ మవున సుందరి సమక్షంలో నాకు ప్రాణం ఎంతో హాయిగా అనిపిస్తుంది.

రమ కంఠం వినీ వినీ విసుగెత్తినప్పుడు. జీవితంమీద మరీ విరక్తి కలిగినప్పుడు ఇక్కడకు వచ్చి చీకట్లో కూర్చుని...వెలుగులో నిలుచున్న శిల్పాన్ని చూస్తుంటాను. అలా చూస్తుంటే కాలం గడుస్తున్న సంగతే తెలియదు! ఎంత ప్రశాంతంగా....సుఖంగా... అనిర్వచనీయమయిన ఆనందంలో గడుస్తుంది ఈ శిల్పం సన్నిధిలో! రమ వద్ద లభించని ఆనందం నా కిక్కడ లభిస్తుంది. అందుకే...అప్పుడప్పుడు ఇలాగ వస్తూంటాను నిద్రపట్టకపోతే."

"మీ బాధ నే నర్థం చేసుకోగలను. మీకు నా హృదయపూర్వక సానుభూతి."

"మీకూనూ" అన్నాడు యువకుడు.

"మరి నేను వెళ్తాను. మళ్ళీ ఎప్పుడో... ఇక్కడే...ఇలాగే కలుసుకుందాం—పరస్పరం అర్థం చేసుకుని హృదయపూర్వకంగా సానుభూతి కలిగిన మంచి మిత్రుల్లా. ఏం?"

"తప్పకుండా."

ఇద్దరూ లేచి ఆ చీకటి రోడ్డుమీద ఒక రటూ మరొక రిటూ చెరోదారీ పడుతూంటే— దీపం కింది శిల్పం నిర్వికారంగా...ఒంటరిగా మిగిలిపోయింది ★